www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 5 ఏప్రిల్ 2025
5
చిత్తూరు



7న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక: ఆర్‌డిఓ

ప్రజాశక్తి- పలమనేరు: ఈ నెల 7వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుండి నిర్వహించనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టరు సుమిత్‌కుమార్ ప్రజా ఫిర్యాదులను స్వీకరిస్తారని పలమనేరు ఆర్‌డిఓ భవాని తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లా డుతూ పలమనేరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఫిర్యాదులు



మాట్లాడుతున్న పలమనేరు ఆర్‌డిఓ భవాని

స్వీకరిస్తారని ఈ కార్యక్రమానికి జిల్లా అన్నిశాఖల అధికారులు, పలమనేరు డివిజన్ స్థాయి అధికారులు హాజరవుతారని పేర్కొన్నా రు. పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్నీ మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని పలమనేరు ఆర్‌డిఓ పేర్కొన్నారు.

మతోన్మాద శక్తులకు ఎదుర్కొందాం ..

సిపిఎం, ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: మతోన్మాద శక్తులను ఎదుర్కొందామని, వక్ఫ్ బోర్డు సవరణల చట్టానికి వ్యతిరేకంగా సిపిఎం నగర కమిటీ, ముస్లిం ఐక్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం కరపత్రాలు పంపిణీ చేసి నిరసన వ్యక్తం చేశారు. చిత్తూరు నగరం సంతపేట పెద్ద దర్గాలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి, కాంజీవరం సురేంద్ర మాట్లాడుతూ లౌకిక విలువలను, మైనార్టీ హక్కులను హరిస్తున్న వక్ఫ్ బోర్డు సవరణలకు వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేయాలని పిలుపు నిచ్చారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పచ్చి మతోన్మాద అజెండాను ముందుకు తీసుకురావడం, ముస్లిం ప్రజలపై విద్వేషాన్ని చిమ్ముతూ అనేక దాడులు చేస్తోందన్నారు. ప్రశాంత లౌకిక దేశంలో మతాలు, కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతోందన్నారు. ఈ దేశం హిందూ దేశం కావాలని, కలలు కనీ ఆర్‌ఎస్ఎస్ వాదులు ఈ దేశాన్ని పరి పాలించడం దురదృష్టకరమన్నారు. ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర అధికార ప్రతినిధి షౌకత్, రాష్ట్ర సమన్వయకర్త ఎస్ఎం రషీద్ మాట్లాడుతూ ముస్లింలను టార్గెట్ చేస్తూ పాలించడం నరేంద్ర మోడీకి మామూలు అయిపోయిందని 20 శాతం ఉన్న ముస్లింలు మెజారిటీగా ఉన్న దళిత బహుజన ప్రజలు కలిసి సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తామని ఆయన తెలిపారు. సంతపేట దర్గా ముందు నాయకులు మాట్లాడుతూ నిరసనగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక విభాగం జిల్లా అధ్యక్షులు బాబు బాయ్ కమిటీ సలహాదారులు గౌస్ భాయ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఖ్రూ బాష, సద్దాం పాల్గొన్నారు.

అత్యంత దుర్మార్గమైన వక్ఫ్‌బోర్డు బిల్లు తీవ్ర ప్రమాదాన్ని వివరిస్తూ సిపిఎం ముద్రించిన కరపత్రాలను సిపిఎం నగర కార్యదర్శి సురేంద్రన్ నేతృత్వంలో సంతపేట పెద్ద మసీదులో నమాజు తర్వాత సిపిఎం, ముస్లిం



వక్ఫ్ బోర్డు చట్టాన్ని వ్యతిరేకిస్తూ చిత్తూరులో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లిం సోదరులు

ఐక్యవేదిక ఉమ్మడిగా ముస్లిం సోదరులకు శుక్రవారం పంపిణీ చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు సురేంద్ర, ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర అధికార ప్రతినిధి సంతపేట షౌకత్, రాష్ట్ర సమన్వయకర్త ఎస్ఎం రషీద్, కార్మిక విభాగం అధ్యక్షులు బాబు భాయ్, సంతపేట గౌస్ మొహిద్దీన్, హారున్ బాష పాల్గొన్నారు.

పలమనేరు: వక్ఫ్ సవరణ చట్టాన్ని పలమనేరు పట్టణంలో పాతపేట అట్లాస్ మసీదు వద్ద శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి గిరిధర్ గుప్త మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు చట్ట సవరణ రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. ఈ సవరణ చట్టం కారణంగా మసీదులు, దర్గాలు, శ్మశానాలు ఇప్పుడు ప్రమాదాలలో పడతాయన్నారు. లక్ష ఎకరాల వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టడానికే ఈ చట్ట సవరణ చేశారన్నారు. ఈ చట్టాన్ని ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మసీదు పెద్దలు పటేల్ సాబ్ , ముతవల్లి సాబ్ రహీం ఖాన్, రాజా, ప్రతాప్ దొరై పాల్గొన్నారు.

అందని జీతాలు

- అవస్థల్లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది
- 15 నుంచి సమ్మె సైరన్

పజాశక్తి- చిత్తూరు అర్బన్: 'వ్యవసాయానికి ప్రాధాన్యత..ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సహం' అంటూ పెద్ద మాటలు చేప్పె ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న సన్నచిన్న కారు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జీతాలు విషయం అసలు పట్టించుకోవడం లేదు. 15 నెలలుగా జీతాలు చెల్లించకపో వడంతో విధిలేని పరిస్థితుల్లో ఈనెల 15వ తేది నుండి రాష్ట్ర వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న వ్యవసాయ సిబ్బంది సమ్మెసైరన్ మోగించనున్నారు. ఈ మేరకు ఇప్పటికే ప్రభుత్వానికి సమ్మె నోటీసులు అందించారు.



వేతనాలు చెలించాలని కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది (ఫైల్‌ఫొటో)

వ్యవసాయానికి ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.61 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రకటించింది. క్షేత్ర స్థాయిలో రూ.10వేల లోపు జీతాలు తీసుకుంటూ పని చేస్తున్న సిబ్బంది జీతాల విషయం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆమేరకు బడ్జెట్‌లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జీతాల విషయం ఊసే లేదంటున్నారు. జీతాలు అందక వ్యవసాయ సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 నెలలుగా జీతాలు అందక అనేక మంది సిబ్బంది తాము ప్రకృతి వ్యవసాయం చేయలేమంటూ చేతులెత్తేశారు. ఈ ఏడాది వార్షిక ప్రణాళికలో ప్రతి క్లస్టర్‌లో విత్తన కిట్లు అందజేసి ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలంటూ ఒత్తిడి చేయడంతో చేసేది లేక తమ సొంత డబ్బులు ఖర్చు పెట్టాల్సిన దయనీయ పరిస్థితి.

జిల్లాలో పని చేస్తున్న 350 మంది ప్రకృతి వ్యవసాయ సిబ్బంది. తమకు చెల్లించాల్సిన పాతబకాయి జీతాలు చెల్లించకుంటే విధులు నిర్వహించలేమని చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఈ నెల 15వ తేది నుండీ రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సమ్మె చేపట్టక తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రకృతి వ్యసాయంపై తమ పరిధిలోని ఉద్యాన రైతులకు అవగాహన కల్పించడం, సేంద్రియ ఎరువుల వాడకం, మార్కెటింగ్, స్టాల్స్ నిర్వహణ, రైతుల వివరాలు యాప్‌లో నమోదు చేయడం వంటి పనులు చేస్తున్న తమకు నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మరో వైపు జీతాలు రాకపోయినా వ్యవసాయశాఖ ఆదేశాల మేరకు స్వంత ఖర్చులతో అనేక కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వద్ద పని చేయించుకుంటున్న జిల్లాస్థాయి అధికారులు వీరి జీతాల విషయంలో ఏమాత్రం పట్టించు కోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం సిబ్బంది జీతాల విషయంలో ఎందుకు ఉదాశీనంగా వ్యవహరిస్తోందో అర్థం కావడం లేదని ఇప్పటికైనా అలోచించి పెండింగ్ జీతాలు చెల్లించడంతో పాటు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కోరుతున్నారు.

సిబ్బంది జీతాలు చెల్లించాలి



ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పెండింగ్ వేతనాలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రకటిస్తున్న ప్రభుత్వం 15 నెలలుగా జీతాలు పెండింగ్ పెడితే ఎలా పని చేస్తారన్న విషయం అలోచించాలి. ఈనెల 15 వ తేదీ లోపు జీతాల విషయంలో ప్రభుత్వం స్పందించ కుంటే రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేపట్టాల్సి వస్తుంది.

- వాడ గంగరాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు

జిల్లాలో రూ.150 కోట్లతో ఉపాధి పనులు

- ఇంకుడు గుంతలు ఏర్పాటు
- భూగర్భ నీటి మట్టం పెంపుకు చర్యలు
- ఎస్‌సి, ఎస్‌టి హ్యాబిటేషన్స్‌లో సిసి రోడ్ల నిర్మాణం
- కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -చిత్తూరు (యాదమరి): జిల్లాలో ఉపాధి హామీ కింద 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.150 కోట్లతో మెటీరియల్ కాంపొనెంట్ పనులను చేపట్టనున్నామని, అభివృద్ధి పనుల మంజూరులో శాసన సభ్యులు, శాసన మండలి సభ్యుల సూచనలు, అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుంటామని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా సచివాలయ సమావేశపు మందిరంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ కింద చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ కింద ప్రధానంగా ఫారం పాండ్ల నిర్మాణం, సిసి రోడ్ల నిర్మాణం చేపట్టనున్నామని తెలిపారు. 2024-25 ఖరీఫ్ సీజన్‌ను అనుసరించి జిల్లాలో 50 శాతం ప్రాంతాలను కరువు ప్రాంతాలుగా గుర్తించామని, భూగర్భ జల వనరులు జిల్లాలో 50 శాతం మండలాలలో తగ్గడాన్ని గుర్తించామన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఉపాధి హామీ కింద ఫారం పాండ్‌ల నిర్మాణం చేపట్టి భూగర్భ నీటి మట్టాన్ని పెంచడానికి చర్యలు చేపట్టామని



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

తెలిపారు. ఇందులో భాగంగా 2025-26 సంవత్సరానికి జిల్లాలో 13,000 ఫారం పాండ్ల నిర్మాణం చేపట్టనున్నామన్నారు. ఒక్కో ఫారం పాండ్ నిర్మాణానికి రూ.40 వేల నుండి రూ.60 వేల వరకు ఖర్చు అవుతుందని, ఒక ఫారం పాండ్ ద్వారా ఒక లక్ష లీటర్ల నీటిని నిల్వ చేయడంతో పాటు భూగర్భ జల మట్టాన్ని పెంచవచ్చునన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 3,253 ఫారం పాండ్ల నిర్మాణాలను ప్రారంభించి 1400 ఫారం పాండ్ల నిర్మాణాలను పూర్తి చేశామన్నారు. సిసి రోడ్ల నిర్మాణాలకు సంబంధించి రూ.79 కోట్లతో 1,605 పనులు చేపట్టి ఇప్పటి వరకు1,326 పనులు పూర్తి చేశామని, ఇందుకు సంబంధించి రూ.25 కోట్ల రూపాయల బిల్లులు చెల్లించామన్నారు. చిత్తూరు - వేలూరు, యాదమరి, చిత్తూరు రోడ్ పనులు, పలమనేరు నియోజకవర్గంలో బిటి రోడ్ల నిర్మాణం, 25 స్కూల్ కాంపౌండ్ పనులు పురోగతిలో వున్నాయన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనుల కింద రూ.150 కోట్లతో బిటి రోడ్లు, సిసి రోడ్లు, కాలువలో పూడికతీత పనులను చేపట్టనున్నామని, దీంతో పాటు ప్రతి ప్రభుత్వ పాఠశాలకు అవసరం మేరకు రూ.8 లక్షలతో ఆట స్థలం ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేస్తామన్నారు. అభివృద్ధి పనులు మంజూరుకు ఎంఎల్‌ఏలు, ఎంఎల్సీల సూచనలు, అభ్యర్థనను పరిగణలోకి తీసుకుంటామన్నారు. చెరువులకు నీరు చేరే ప్రధాన కాలువలలో పూడికతీత పనులు చేపట్టి వర్షాకాలంలో నీటిని నిలువ చేసే కార్యక్రమం చేపట్టానున్నామన్నారు. ఎస్‌సి, ఎస్‌టి హ్యాబిటేషన్స్‌లో వంద శాతం సిసి రోడ్ల నిర్మాణం పనులు చేపడతామన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ రవికుమార్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం తొలగింపు

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: గత ఏడాది 2.5 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని సదుం తహశీల్దారు, పోలీసులు శుక్రవారం తొలగించారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు..సదుం మండల పరిధిలోని కలకట వారి పల్లి దళిత వాడ లో గత సంవత్సరం ఇదే గ్రామానికి చెందిన ఎన్ ఆర్ఎస్ఏ విశ్రాంత ఉద్యోగి శిబ్బాల ఎర్రయ్య కలెక్టర్ వారి పల్లి రామాలయం గుడి ముందు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక తహశీల్దారు మారూఫ్ హుస్సేన్, చౌడేపల్లి రూరల్ సీఐ రాంభూపాల్, సదుం ఎస్ఐ షేక్ షావలి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాన్ని శుక్రవారం తొలగించారు. ముందు గొర్రెపర్తి ప్రభాకర్ అనే వ్యక్తి ఏర్పాటు చేసిన సిమెంట్ దీనిపైకి హిటాచి యంత్రంతో మార్చారు. ఇందుకు సంబంధించిన విషయాలపై గత సంవత్సరం ఇదే గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఒకచోట నుండి మరో చోటికి మార్చేందుకు చిత్తూరు కలెక్టర్ ఆదేశాలు ఏమైనా ఉన్నాయా? రాతపూర్వక ఉత్తరం కాపీలు ఏమైనా ఉన్నాయా?' అని వివరణ కోరగా సంబంధిత అధికారులు కలెక్టర్ ఉత్తర్వు కాపీలు ఏమీ లేనట్లు 'ప్రజాశక్తి'కి వివరణ ఇచ్చారు. ఇదే గ్రామానికి చెందిన గొర్రెపర్తి ప్రభాకర్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక గ్రామస్తులతో మాట్లాడి, గ్రామస్తుల సహకారంతో ఇదే గ్రామంలోనే రామాలయం గుడికి ముందు ఉన్న ఖాళీ స్థలంలో ప్రభాకర్ అనుచరులు ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మె పైకి విగ్రహాన్ని మారుస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారి పల్లి దళితవాడ గ్రామస్తులను వివరణ కోరగా ప్రభాకర్ అభిప్రాయాలతో వ్యతిరేకించిన జూపూడి శ్రీరాములు, గుర్రం రామయ్య, గొర్రెపర్తి రమణ తదితరులు అంబేద్కర్ విగ్రహాన్ని ఉన్న స్థలం నుండీ ప్రభాకర్ ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మె పైకి మార్చే చర్యను వ్యతిరేకిస్తున్నామని వారు విలేకరు లకు తెలిపారు.

మరో చోటుకు మార్పు?



అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించిన అధికారులు

ఈ సందర్భంగా బలవంతంగా ఉన్నతాధికారులు వేరే చోటికి తరలించడంపై మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రసిడెంట్ యమల సుదర్శనం తీవ్రంగా ఖండించారు.

వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

డిసిసి అధ్యక్షులు పోటుగారి భాస్కర్

ప్రజాశక్తి -వెదురుకుప్పం: వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని చిత్తూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పోటుగారి భాస్కర్ ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా పోటుగారి భాస్కర్ శుక్రవారం విలేకరులతో మాట్లా డు తూ ఈ బిల్లు రాజ్యాంగంలోని నిబంధనలను నీరుగార్చే విధంగా, మైనారిటీలను కించపరిచే విధంగా ఉందని విమర్శించారు. వారికి రాజ్యాంగం కల్పించిన హక్కులను తొలగించేలా వుందన్నారు. సోదర భావంతో నడుస్తున్న భారతదేశాన్ని విభజించే విధంగా ఉందన్నారు. ఈ బిల్లు విషయంలో ప్రతిపక్షాల సూచనలను ఎన్‌డిఏ ప్రభుత్వం బేఖాతరు చేసిందన్నారు. దేశ లౌకిక ప్రతిష్టతను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలోని ఎంపీలు, మంత్రులు బిజెపికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని, బిజెపి పరమత ద్వేషిగా చరిత్రలో నిలిచిపోతుందన్నారు. రాష్ట్రంలో టిడిపి, జనసేనలు ముస్లిం ద్రోహులుగా మిగిలిపోతారన్నారు. చంద్రబాబుకి, పవన్ కళ్యాణ్‌కి వక్ఫ్ సవరణ బిల్లుపై ఉన్న మోజు ప్రత్యేక హోదాపై ఎందుకు లేదని ప్రశ్నించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని వయచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలకు గుణపాఠం నేర్పుతారని పోటుగారి భాస్కర్ హెచ్చరించారు. సర్వ మతాలు, కులాల సమ్మేళనమే భారతదేశం అన్నారు. చంద్రబాబుకు అవకాశవాద రాజకీయాలు చేయడం కొత్తేమీ కాదని, జనసేన నేత పవన్ కళ్యాణ్ సినిమాల్లో నటించినట్లే రాజకీయాల్లోనూ నటిస్తున్నారని ప్రజలు అంతా గమనిస్తున్నారని,



సమావేశంలో మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు భాస్కర్

సమయం వచ్చినప్పుడు తిరగబడతారని, తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. మంత్రి లోకేష్ 'రెడ్ బుక్' రాజ్యాంగాన్ని అమలుపరుస్తూ, ప్రతిపక్ష పార్టీలను బెదిరిస్తూ శాసనసభలో, బయట మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారని పోటుగారి భాస్కర్ ఆరోపించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా వుండాలి

వైద్య సిబ్బందికి డిఎంఅండ్‌హెచ్‌వో ఆదేశం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: పరిసరాలు పరిశుభ్రంగా వుంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందిని ఆదేశించారు. ముడి బాపనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుధారాణి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఓపి సేన్సెస్, ఐఎల్ఆర్, కోల్డ్ చైన్ మెయింటెనెన్స్ కచ్చితత్వంతో ఉండాలని, ఆస్పత్రిలో కాన్పులు ఎక్కువ చేయాలని, అన్ని రకాల ల్యాబ్ పరీక్షలు తప్పక చేయాలని, అబిఐడి జనరేషన్, ఎన్సీడీ స్క్రీనింగ్ అప్డేటెడ్‌గా ఉండాలని, ఫార్మసీలో అన్ని రకాల మందులు అప్డేట్ చేయాలని, వడదెబ్బ వడగాల్పులలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అన్ని జాతీయ ఆరోగ్యకార్యక్రమాల రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డిఎంఅండ్‌హెచ్‌వో డిటి సుధారాణి

ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ, డాక్టర్ నవీన్ తేజ్ రాయి, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

విజయవాడ విద్యార్థినికి 'బెస్ట్ పేపర్ ఇన్ ట్రాక్' అవార్డు

ప్రజాశక్తి - నగరి: విజయవాడ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో డిపార్ట్ మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, పారి స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో సెకండ్ ఇయర్ పీహెచ్‌డీ చదువుతున్న సయ్యదాహాఫ్సా అనే విద్యార్థినికి 'బెస్ట్ పేపర్ ఇన్ ట్రాక్ అవార్డు' దక్కింది. గత నెల 21వ తేదీన బిట్స్ పిలానీ క్యాంపస్ నిర్వహించిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎవిడెన్స్ బేస్డ్ మేనేజ్‌మెంట్ (ఐసీఈబీఎం)లో పాల్గొన్న ఆమె 'బియాండ్ ది డెస్క్: ఫ్యూయలింగ్ డిజిటల్ ఇన్నోవేషన్ త్రూ వర్క్‌ప్లేస్ ఫ్లెక్సిబిలిటీ' అనే పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. ఇందుకు ఆమెకు 'బెస్ట్ పేపర్ ఇన్ ట్రాక్ అవార్డు' ప్రదానం చేశారు. కాగా ఈమె భర్త షేక్‌సలీమ్ రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్‌గా స్థానికంగా పనిచేస్తున్నారు. కళాశాల డీన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్ మెంట్, ఎఆర్ఎం పీఎస్‌బీలు అందించిన మద్దతు, మార్గదర్శకత్వం తోనే అవార్డు సాధించగలిగానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. విలువైన సలహాలు సూచనలు అందించిన డాక్టర్ జుమాన్ ఇక్బాల్‌కు, ప్రోత్సాహం అందించిన కుటుంబ సభ్యుల కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



అవార్డు పొందిన సయ్యదాహాఫ్సా

ఆస్తి పన్నులో ఐదు శాతం రాయితీ: కమిషనర్

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరపాలక సంస్థకు సంబంధిం చి 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి ముంద స్తు గా ఆస్తి పన్ను చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు నగర కమిషనర్ పి నరసింహ ప్రసాద్ తెలిపారు. 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను మొత్తాన్ని ముందస్తుగా ఏక మొత్తం ఈ నెల 30వ తేదీ లోపు చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ లభిస్తుందన్నారు. ఈ నెలాఖరులోగా ఆస్తి పన్ను చెల్లించి అసలులో ఐదు శాతం రాయితీ పొందాలన్నారు. ఐదు శాతం రాయితీ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, పనులు చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. పన్నులను నగరపాలక కార్యాలయం లోని పురసేవ కౌంటర్ వద్ద, వార్డు సచివాలయాల్లోనూ చెల్లించవచ్చని తెలిపారు.



బర్డ్‌ఫ్లూపై అవగాహన

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : కోళ్ల ఫారంను డిప్యూటీ డైరెక్టర్ గోవిందయ్య , అసిస్టెంట్ డైరెక్టర్ రూప సుందరి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు బర్డ్ ఫ్లూపై అవగాహన కల్పించారు. ఎస్ఆర్ పురం మండలం మెదవాడ పంచాయతీ మర్రిపల్లి గ్రామంలో ఉన్న కోళ్ల ఫారంను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోళ్లకు బ్లడ్ ఫ్లూ వంటి లక్షణాలు రాకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలో యాజమాన్యానికి అవగాహన కల్పించి సూచనలు, సలహాలు ఇచ్చారు. బర్డ్ ఫ్లూ వస్తే తమకు తెలపాలని యాజమాన్యానికి తెలిపారు. కోళ్ల పెంపకం కోళ్లకు ఎలాంటి ఆహారం అందిస్తున్నారని వాటి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారిణి డాక్టర్ శ్రీవిద్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కోళ్ల ఫారంను తనిఖీ చేస్తున్న డిప్యూటీ డైరెక్టర్ గోవిందయ్య



బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

ముందస్తు బాబు జగ్జీవన్ రామ్ జయంతి

ప్రజాశక్తి- వెదురుకుప్పం: డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత మాజీ ఉప ప్రధాన మంత్రి, స్వాతంత్ర్య సమరయోధులు, దళిత వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి అన్నపూర్ణ శారద ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ జీవితం, ఆయన చేసిన సేవలు నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలను, ముఖ్యంగా దళిత వర్గాల అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఆయన నిరంతరం పేద ప్రజల కోసం పాటు పడ్డారని, వారి హక్కుల కోసం పోరాడారని గుర్తు చేశారు. అనంతరం, విద్యార్థులు బాబు జగ్జీవన్ రామ్ జీవిత చరిత్రను, ఆయన సేవలను వివరించారు. ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకుంటూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఓ హరిప్రసాద్‌రెడ్డి

'స్వామిత్వ సర్వే' పరిశీలన


ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండల పరిధిలోని పాతవెంకటాపురం, గెరిగలపల్లిలో నిర్వహిస్తున్న స్వామి త్వ సర్వేను ఎంపిడి ఓ హరి ప్రసాదరెడ్డి శుక్రవారం సంద ర్శిం చారు. ఈ సందర్భంగా శుక్రవారం గ్రామ ప్రజలకు స్వామిత్వ సర్వే వల్ల కలుగు ప్రయోజనాలను వివరించి, మండల స్వామిత్వ సర్వే టీమ్‌కు తగు సూచనలు చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ స్వామిత్వ సర్వే గ్రామీణ ప్రాంతాల్లోని భూములను డ్రోన్ల ద్వారా సర్వే చేసి, ఆయా భూముల యాజమాన్య హక్కులను గ్రామస్తులకు అందించే ఒక పథకం అని, దీని ద్వారా, గ్రామస్తులు తమ భూములకు సంబంధించిన వివాదాలను పరిష్కరించు కోవచ్చన్నారు. బ్యాంకుల్లో రుణాలు పొందడానికి కూడా వీలవుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని భూముల యాజమాన్య హక్కులను స్పష్టంగా నిర్ధారించడం, భూములకు సంబంధించిన వివాదాలను తగ్గించడం, గ్రామస్తులకు బ్యాంకుల్లో రుణాలు పొందడానికి వీలు కల్పించడం, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడానికి సహాయ పడుతుందన్నారు. డ్రోన్ల ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటిని, భూమిని మ్యాపింగ్, తర్వాత మ్యాపింగ్ ఆధారంగా, గ్రామస్తులకు వారి భూముల యాజమాన్య హక్కులకు సంబంధించిన పత్రాలను అందిస్తారని తెలిపారు. ఈ పత్రాల ను ఉపయోగించి, గ్రామస్తులు తమ భూములకు సంబంధిం చిన వివాదాలు పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ కుమార్, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి చిట్టిబాబు

ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపాలి: ఎంఏవో

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: రైతులు ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపాలని మండ ల వ్యవ సాయ అధికారి చిట్టి బాబు అన్నా రు. శుక్రవారం మండ ల కేంద్రం లోని మండల సర్వసభ సమావేశం మందిరంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వెలుగు సిబ్బంది ప్రకృతి వ్యవసాయంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి చిట్టిబాబు మాట్లాడుతూ రసాయన ఎరువుల వల్ల భూసాంద్రత దెబ్బతింటుందని వాటి నుండి ఉత్పత్తి అయ్యే కూరగాయలు, వరి వల్ల ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారని రసాయన ఎరువులు మానుకుని ప్రకృతి సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేయాలని దీనివలన ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం రవి, మండల వ్యవసాయ విస్తరణ విస్తరణ అధికారి సాదరయ్య, ఆర్‌వైఎస్ఎస్ యూనిట్ ఇన్‌ఛార్జి అంబికా గాంధీ, విజయలక్ష్మి, పలువురు ప్రకృతి వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ వెలుగు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని ప్రధానోపాధ్యాయులు రవీంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని దండువారి పల్లి మండల ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవ సభ ఉపాధ్యాయులు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు 5వ తరగతి ముగించుకుని ఆరవ తరగతికి వెళుతున్నారని పాఠశాలలో ఉపాధ్యాయుల బోధించిన పాఠాలను నేర్చుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని పాఠశాలలో సత్ప్రర్తనతో మెలగాలన్నారు. అనంతరం విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో సర్పంచి అమర ఉపాధ్యాయులు లక్ష్మీపతి, మొగిలయ్య, శంకరయ్య , శ్రీపతి రెడ్డి, లక్ష్మి, అనిత, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -సోమల: సోమల మండల ఎంఆర్‌పిఎస్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం మండల కేంద్రం సోమలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చిత్తూరు జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ఎంపీ ప్రకాష్ ఆదేశాల మేరకు నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ నూతన మండల అధ్యక్షులుగా ఎర్రబెల్లి రవి, ఉపాధ్యక్షులుగా కాగతి కృష్ణయ్య ఎన్నికయ్యారు. కార్యదర్శిగా బీర్ని రవి ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి మురళి, జిల్లా కార్యదర్శి మందా రామనాథం, ఎం ఎస్ పి మండల అధ్యక్షులు ప్రకాష్, నియోజకవర్గ యువసేన అధ్యక్షులు శుభకర్, సీనియర్ నాయకులు సురేంద్ర, హరికృష్ణ గోవిందు, రెడ్డప్ప లక్ష్మీపతి పాల్గొన్నారు.



ఎంఆర్‌పిఎస్ మండల నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం పరిసర ప్రాంతాలలో దొంగ తనాలు జోరుగా చోటుచేసుకుంటున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని గుడ్లనాయనపల్లి గ్రామంలో సర్పంచ్ ఝాన్సీ గిరిప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజలకు దొంగతనాలకు గురి కాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన సదస్సును నిర్వహించారు. దొంగతనాలు అరికట్టడంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని, ప్రధానంగా ప్రజలు బయట ఊర్లకు వెళ్లినప్పుడు తమ ఇంటి పరిసరాలలో భద్రత ఏర్పాట్లు చేసుకోవాలని, పోలీసులకు ముందస్తు సమాచారం అందించాలని, వ్యాపార కేంద్రాలు, అంగళ్ల వద్ద భద్రత ఏర్పాట్లను పటిష్టంగా చేసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం, ముఖ్యంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారుచేసిన డిజిటల్ లాక్ వాడడం వంటివి దొంగతనాలను అరికడుతుందన్నారు. డిజిటల్ లాక్ ను దొంగలు తెరవడానికి ప్రయత్నం చేసిన వేల అలారం మోగుతుందని, దీంతో చుట్టుపక్కల ప్రజలు అప్రమత్తం అయ్యి, దొంగలను పట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలకు దొంగతనాలపై అప్రమత్తంగా వుండాలని అవగాహన కల్పిస్తున్న పోలీసులు

శ్రీరామనవమికి ప్రత్యేక కార్యక్రమాలు

ప్రజాశక్తి -సోమల: సోమల శ్రీ సాయి ఆలయంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం ఎనిమిది గంటల 30 నిమిషాలకు గణపతి హోమం, నవగ్రహ హోమం , మహాకుంభా భిషేకం, మూల విగ్రహం ప్రత్యేక అలంకరణ పూజలు అభిషేకం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం నిర్వహిస్తామన్నారు. ఆదివారం సాయంత్రం ఏడు గంటల నుండి సోమల పురవీధులలో పుష్ప పల్లకిలో శ్రీ సాయి ఉత్సవ విగ్రహ ఊరేగింపు ఉంటాయని, భజన బృందాలు ఆటపాటలతో మంగళ వాయిద్యాలతో ఊరేగింపును నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న టిడిపి నాయకులు

ఉచిత మంచినీటి సరఫరా

ప్రజాశక్తి-కుప్పం రూరల్ : కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ కొత్తూరు, రామాపురం గ్రామాల పరిధిలో ఉచిత మంచినీటి సరఫరాను స్థానిక టిడిపి నాయకులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి ప్రారంభం అవుతున్న సమయంలో చెక్కునత్తం పంచాయతీ కొత్తూరు, రామాపురం గ్రామాలలో నీటి ఎద్దడితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల సమస్యను గుర్తించి, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పి ఎస్ మునిరత్నం ల సూచనల మేరకు ట్యాంకర్ల ద్వారా మంచి నీటిని సరఫరా చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రజల సమస్యలపై స్పందించి, సమస్యకు పరిష్కారం చెప్పిన ముఖ్యమంత్రికి, స్థానిక నాయకులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ అధ్యక్షులు మునిరత్నం, బూత్ ఇన్‌ఛార్జి బీరప్ప, బిఎల్ఎ రామప్ప, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



వైసిపి కార్యకర్తల కుటుంబాలను పరామర్శిస్తున్న నారాయణస్వామి

కార్యకర్తలు అధైర్యపడొద్దు..

మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : 'గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైసిపి కార్యకర్తకు, నాయకులకు ఏ కష్టం వచ్చినా , ఎవరైనా ఇబ్బంది పెట్టించినా , అక్రమ కేసులు బనాయించినా ఎవరూ అధైర్య పడొద్దు.. వైసిపి కార్యకర్తలకు, నాయకులకు ఎల్లవేళలా అండగా ఉంటా' అని మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి భరోసా ఇచ్చారు. ఈ సందర్భం గా శుక్రవారం మండలంలో డిప్యూటీ సీఎం నారాయణ స్వామి సుడిగాలి పర్యటన చేశారు. పెద్దతయ్యూరు గ్రామంలో అనారోగ్యానికి గురైన వైసిపి నాయకుడు వెంకటేష్ , 49 కొత్తపల్లి మిట్టలో ఇటీవల కంటికి శాస్త్ర చికిత్స చేసుకున్న మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోవిందస్వామి, అనారోగ్యానికి గురైన మాజీ డిప్యూటీ సీఎం వియ్యంకుడు , రిటైర్డ్ టీచర్ దొరస్వామి , వైసిపి నాయకుడు రమేష్ తల్లి ఇటీవల మృతి చెందారు. రమేష్‌ను వారి కుటుంబ సభ్యులను మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఓదార్చి వారికి అండగా ఉంటామని కుటుంబ సభ్యులకి భరోసా కల్పించారు. కొత్తపల్లి గ్రామ పంచాయతీ వైస్ ప్రసిడెంట్, సీనియర్ నాయకుడు సుందర మూర్తి రెడ్డి ఇటీవల ఓ ప్రమాదంలో కాలుకు దెబ్బ తగిలి తీవ్ర గాయం కావడంతో అతనిని పరామర్శించి అండగా ఉంటారని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు గురవారెడ్డి, , యేసయ్య, విజయబాబు, జనార్ధన్, రాజశేఖర్ రెడ్డి, శ్యామ్, భూపతి రెడ్డి, కోటిరెడ్డి బాబు, సుధా, కుమార్, బాబు, శేషు పాల్గొన్నారు.

సైన్స్ విజ్ఞానంపై పట్టు ఉండాలి

ప్రజాశక్తి- గుడిపాల: సైన్స్ విజ్ఞాన శాస్త్రంపై విద్యార్థులకు పటుట వుండాలని మండల విద్యాశాఖ అధికారులు గణపతి , హసన్ బాషా పేర్కొన్నారు. స్థానిక సిఎస్ఆర్ పాఠశాల ప్రాంగణంలో సైన్స్ విజ్ఞాన ప్రదర్శన శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారులు గణపతి , హసన్ బాషా మాట్లాడుతూ సైన్స్ విజ్ఞాన శాస్త్రం ప్రాముఖ్యత, దాని ఉపయోగాలను ప్రజలకు తెలపడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. వైజ్ఞానిక రంగంలో తొలి నోబెల్ బహుమతి అందుకున్న వ్యక్తి సివిరామన్ అన్నారు. ఇతను చిన్న వయసులోనే ఎన్నో ప్రతిష్టాత్మక పరిశోధనలు చేసి తన మేధో శక్తితో భారతదేశ కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో నిలిపారన్నారు. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు నౌషద్ మాట్లాడుతూ భౌతిక శాస్త్ర సూత్రాలపై అనేక విజ్ఞాన పరికరాలైన ఉపగ్రహాలు, రాకెట్, ఎన్నో సైన్స్ ఉపకరణాలు పని చేస్తాయన్నారు. ప్రాథమిక వైద్యాధికారిణి సంధ్య మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సైన్స్‌కు సంబంధించిన విషయాలను తెలుసు కోవాలన్నారు. విజ్ఞాన శాస్త్ర జ్ఞానాన్ని సంపాదించడం వల్ల గొప్ప శాస్త్రజ్ఞులు తయార వుతున్నారు. బొమ్మసముద్రం జూనియర్ కళాశాల ప్రధానా చార్యులు శరత్ చంద్ర మాట్లాడుతూ విద్యార్థి దశ నుం డే విజ్ఞాన శాస్త్రం పట్ల మంచి అవగా హనను అల వర్చు కోవాలన్నారు. విద్యార్థు లు ఇష్టపడి చేసిన పని సంతృప్తినిస్తుందన్నారు. ఈ సందర్భం గా విద్యార్థు లు రూపొందించిన విజ్ఞాన శాస్త్ర ఉపకరణాలు సందర్శించిన పలువురిని ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమం లో పాఠశాల కరస్పాండెంట్ లోకేష్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఖాతుంబి, రోబోటిక్ ట్రైనర్ దీప, ప్రధానోపాధ్యాయురాలు సుధ, ఉపాధ్యాయులు హేమంత్ కుమార్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులు ప్రదర్శిస్తున్న సైన్స్ ప్రయోగ పరికరాలను తిలకిస్తున్న విద్యాధికారులు

ప్రతి ఫ్రైడే డ్రైడే నిర్వహించాలి

- డాక్టర్ లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి -యాదమరి: 'దోమలను అరికడదాం.. వాటి వల్ల వచ్చే ప్రాణాంతక జ్వరాలు వారి నుండి ప్రజలను కాపాడుదాం..' అంటూ యాద మరి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ పిలుపు నిచ్చారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడేలో భాగంగా ఆయన యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆరిమాకులపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్‌ఓ మాట్లాడుతూ దోమలు వ్యాప్తి వల్ల ప్రాణాంతకమైన జ్వరాలు బారినపడి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వుందని దోమ కాటు వల్ల డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, మెదడు వాపు బోదకాలు లాంటి జ్వరాలు వ్యాప్తి చెందుతాయని వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు నివాస గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలను అరికట్ట వచ్చ ని సిహెచ్‌ఓ పేర్కొ న్నా రు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు భువనేశ్వ రి, రమాదేవి, రమీళా, గ్రామస్తులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పొదుపు సంఘాల పాత్ర కీలకం: ఎంపీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: దేశాభివృద్ధిలో స్వయం సహాయక పొదుపు సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని టిడిపి పార్లమెంటరీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, జాతీయ ఎస్‌సి, ఎస్‌టి వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ సభ్యులు, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. మహిళా సాధికారతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీ పార్లమెంటులో బడ్జెట్ సమావేశాలకు హాజరైన చిత్తూరు శుక్రవారం లోక్ సభలో ప్రశ్నోత్తరాల సమయంలో స్వయం సహాయక పొదుపు సంఘాలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలు, ఉపాధి అవకాశాలు, దేశాభివృద్ధిలో స్వయం సహాయక పొదుపు సంఘాలు పోషిస్తున్న కీలక పాత్ర, గత ఐదేళ్లతో పాటు ఈ సంవత్సరం వివరాలను కేంద్ర, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మంత్రి తోహన్ సాహును అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. దీనికి సంబంధిత శాఖ సానుకూలంగా స్పందించడమే కాకుండా తాను కోరిన అంశానికి సంబంధించి వివరాలు లిఖిత పూర్వకంగా అందించినట్లు ఎంపీ ప్రసాదరావు మీడియాకు వెల్లడించారు. స్వయం సహాయక పొదుపు సంఘాల మహిళలను అన్ని రకాల ఆదుకు నేందుకు కూటమి ప్రభుత్వం దృఢ సంకల్పంతో పనిచేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో అధిక ప్రాధాన్యత ఇస్తూ మహిళలను మహారాణులుగా చేయడమే లక్ష్యంగా ముందుకెళుతోందన్నారు. ఇందుకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం మహిళల శ్రేయస్సు కోసం సంస్కరణతో చేయూత నిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయం సహాయక పొదుపు సంఘాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.

7 నుండి అడ్మిషన్లు ప్రారంభం

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రం సోమలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల ఏడవ తేదీ నుండి మొదటి సంవత్సరం చేరాలనుకున్న విద్యార్థులకు అడ్మిషన్లు ప్రారంభిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ తమ కళాశాలలో ఎంపీసీ బైపిసి, హెచ్ ఇసి, సిఇసి, ఎంపిహెచ్ డబ్ల్యు(విద్యార్థినులకు) గ్రూపులు వున్నాయని, ఈ విద్యా సంవత్సరంలో నూతనంగా ఎంబైపీసీ(ఎంపీసీ బైపిసి) గ్రూపును కొత్తగా ప్రవేశపెట్టారని విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వం పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, ల్యాబ్ రికార్డ్స్, స్టడీ మెటీరియల్ అందజేస్తారని, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని కూడా ప్రభుత్వం అందిస్తోందని మండలంలోని పదవ తరగతి పాసైన విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరి ఉత్తమ బోధనను అందుకుని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు.



శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి -కార్వేటినగరం: టీటీడీ అనుబంధంగా వున్న శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో వెలసిన శ్రీ సీతా కోదండరాముల స్వామివారి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేకువ జామున స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి మూలవిరాట్‌కు శుద్ధి, తోమాల, కొలువు, పంచాంగ శ్రవణ, అర్చన వంటి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలు విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం 9.30 నుంచి 10.30 గంటల వరకు వేద పండితులు వేద మంత్రాల నడుమ చందనం, పాలు, పెరుగు, తేనే, నారికేళీ జలాలు వంటి సుగంధ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఉత్సవర్ల సమర్పణ అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. సాయంత్రం స్వామివార్లను తిరుచి వాహనంపై ప్రతిష్టించి ఊజంల్ మండపానికి వేంచేసి సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 గంటల వరకు స్వామివారిని ఆలయ ఆవరణలో ఉన్న ఊజంల్ సేవలో కొలువు దీర్చి వేద పండితులు వేదమంత్రాల నడుమ అత్య వైభవంగా ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం సీతా కోదండరాముల వారిని పట్టు వస్త్ర, సుగంధభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి 6.30 నుంచి 8.30 వరకు గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి సురేష్‌కుమార్, వేదపండితులు, టీటీడీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

క్రైం న్యూస్



ఇసుక లారీని సీజ్ చేసిన పోలీసులు

అనుమతి లేని ఇసుక లారీ సీజ్

ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి -గుడిపాల: అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని సీజ్ చేసినట్లు గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. శుక్రవారం గొల్లమడుగు వద్ద తనిఖీలు చేస్తుండగా తమిళనాడుకు వెళుతున్న టీఎన్ 18 ఎయు 2228 నెంబరు గల ఇసుక లారీని తనిఖీ చేస్తుండగా అనుమతులు, పర్మిట్లు లేక పోవడంతో సీజ్ చేశామన్నారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన నిందితులు రాజా, రాము ను అరెస్టుచేశామని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

తల్లిని కాపాడే ప్రయత్నంలో..

కన్న తండ్రిని చంపిన కొడుకు అరెస్ట్

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం : మద్యానికి బానిసైన తండ్రి నుండి తల్లిని కాపాడే ప్రయత్నంలో కొడుకు చేతిలో కన్నతండ్రి మృతి చెందిన సంఘటన మండలంలో మూడు రోజుల క్రితం చోటుచేసుకున్న సంగతి విదితమే.. ఈ కేసుకు సంబంధించి నిందితుడు నాగరాజ మందడిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎస్ఆర్ పురం మండలంలోని పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు మందడి (60) మద్యానికి బానిసై భార్య జ్యోతితో ప్రతిరోజూ ఇంట్లో గొడవపడేవారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం భార్యా భర్తల మధ్య గొడవ తీవ్ర స్థాయికి చేరడంతో శ్రీనివాసుల మందడిని కొడుకు నాగరాజులు మందడి (36) కోపంతో కన్నతండ్రిపై పక్కనే ఉన్న ఇటుక రాయితో దాడి చేశాడు. శ్రీనివాసుల మందడి తలకి బలమైన గాయాలవడంతో మృతి చెందిన సంఘటన పాఠకులకు విదితమే. శుక్రవారం నాగరాజు మందడిని కార్వేటి నగరం సీఐ హనుమంతప్ప, ఎస్సై సుమన్ అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు.

సాయిబాబాని దర్శించుకున్న పెద్దిరెడ్డి



ప్రజాశక్తి -బంగారుపాళ్యం: బంగారుపాలెం మండలం పాలేరు పంచాయతీ జగనన్న కాలనీలో శుక్రవారం సాయి బాబా విగ్రహ ప్రతిష్ట కుంభాభిషేక నిర్వాహకులు పాలకూర రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. మూడు రోజులుగా వివిధ రకాల పూజా కార్యక్రమాలు చేపట్టి శుక్రవారం విగ్రహ ప్రతిష్ట కుంభాభిషేకం చేశారు. సాయిబాబాను పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యేలు సునీల్ కుమార్, చింతల రామచంద్రారెడ్డి , లలిత కుమారి, జెడ్‌పి మాజీ ఛైర్మన్ కుమార్ రాజా, ఎంపీపీ అమరావతి , వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, రాష్ట్ర ఎరుకుల సేవ సంఘ కార్యదర్శి శివశంకర్, సాయిబాబా దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు: ఎంఏవో

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు మండల రైతులకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ పనిముట్లు వ్యవసాయ శాఖలో స్ప్రేయర్లు, వ్యవసాయ పనిముట్లు 50 శాతం రాయితీ లేదా ఎస్ఎంఎం మార్గదర్శకాలలో పేర్కొన్న గరిష్ట పరిమితికి లోబడి ధరలతో రైతులకు అందుబాటులో ఉన్నాయని పలమనేరు మండలం వ్యవసాయ అధికారి సంధ్య తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ పథకం పొందడానికి ఎస్‌సి, ఎస్‌టి మహిళా ,సన్న , చిన్న కారు రైతులు అర్హులు అని, గత 5 సంవత్సరాల్లో రాయితీ వ్యవసాయ యాంత్రీకరణ ఉపయోగించుకోని రైతులు ఈ పంటలో నమోదు చేసుకుని పట్టాదారు పాసు బుక్‌లు కలిగిన రైతులు అర్హులు అని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.



విద్యార్థులు త్వరగా కోలుకోవాలి

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : తమ విద్యా సంస్థలలో చదువుకుంటూ రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని బిసిఎన్ విద్యా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు బిసి నాగరాజు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారు ప్రమాదానికి గురైన విద్యార్థుల వైద్య ఖర్చుల నిమిత్తం శుక్రవారం కళాశాల ఆవరణలో బాధితుల కుటుంబ సభ్యులకు చెక్కులను అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ కళాశాలలో ఈసీఈ చదువుతున్న విద్యార్థులు పి లోకేష్, చందులు రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాల పాలైనట్లు తెలిపారు. వారు బెంగళూరు నగరంలోని వేరు వేరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, వారి వైద్య సేవల నిమిత్తం ఇప్పటికే వారి కుటుంబ సభ్యులు సుమారు 6 లక్షల రూపాయలకు పైగా ఖర్చు చేసినట్లు తెలిపారు. వారి వైద్య ఖర్చుల నిమిత్తం తమ వంతు సాయంగా తోటి విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, యాజమాన్యం 1,70,225 రూపాయలు విరాళంగా సేకరించారని తెలిపారు. అందులో పి. లోకేష్ కు 1,00,150 రూపాయలు, చందుకు 70,105 రూపాయలను చెక్కుల రూపంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమములో కళాశాల ప్రిన్సిపాల్ డా. సుధాకరబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు భాస్కరన్, ఆర్ అండ్ డి డైరెక్టర్ డాక్టరు కోదండరామయ్య, వివిధ శాఖల విభాగాధిపతులు, పిఆర్ఓ ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థుల కుటుంబాలకు చెక్కులు అందిస్తున్న బిసిఎన్ కళాశాల వ్యవస్థాపక అధ్యక్షులు బిసి నాగరాజు